విద్యార్థుల ఫీజులు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.4 వేల కోట్లు చెల్లించడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని, మూసీ సుందరీకరణకు లక్షా యాభైవేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. మూడు నెలల నుంచి ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులు రోడ్లెక్కి ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం ఇంతవరకు స్పందించడం లేదన్నారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో కలిసి మాసబ్‌ట్యాంక్ నుంచి బీసీ సంక్షేమ భవన్‌కు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..పది నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు ఎన్ని, ఆదాయం ఎంత, కాంట్రాక్టర్లకు ఎంత చెల్లించారు, తదితర బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయాలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ర్యాలీగా మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్‌కు వెళ్తుంటే పోలీసులు మధ్యలో వారిని అడ్డుకొని ర్యాలీని చెదరగొట్టారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, పృథ్వీగౌడ్, రవికుమార్ యాదవ్, దొడ్డపల్లి రఘుపతి, నిఖిల్, చిక్కుడు బాలయ్య ముదిరాజ్, బల్‌రామ్‌లతో పాటు బీసీ సంఘం విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న సురభి వాణీదేవి

నాంపల్లి: తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరుగుతాయి. తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి ప్రారంభమైన కోదాటి లక్ష్మీ నరసింహారావు ఉత్సవాల్లో భాగంగా నాటకాలను ప్రదర్శిస్తున్నారు. మొదటి రోజు మేకా రామకృష్ణ దర్శకత్వంలో లక్ష్మీ నరసింహారావు రచించిన 'ఉంగరాల వేళ్లు'నాటికను ప్రదర్శించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ జూలూరి గౌరి శంకర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించిన ఆమె ప్రసంగించారు. నటులు గుమ్మడి గోపాలకృష్ణ, శివకుమార్, కోదాటి శ్యాంసుందర్‌రావు, కోదాటి వెంకటరమణ, గోవాడ వెంకట్, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాధు శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

కొమురం భీమ్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న సూర్యధనుంజయ్


నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్

సుల్తాన్‌బజార్: జై జంగల్ జమీన్ అనే నినాదంతో అడవి బిడ్డల హక్కుల కోసం నైజాం సర్కార్‌తో పోరాటం చేసిన వీరుడు కొమురంభీమ్ అని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ అన్నారు. కొమురంభీమ్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో కొమురంభీమ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..జాతి హక్కుల కోసం, అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం అలుపులేని యుద్ధం చేసిన గోండు ముద్దుబిడ్డ కొమురంభీమ్ అన్నారు. ఆయన జీవితం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతమ్మ, డాక్టర్ కృష్ణ, డాక్టర్ శైలజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలకు ఆద్యుడు కొమురంభీమ్..

గన్‌ఫౌండ్రీ: గిరిజన రక్షణ చట్టాలు రావడానికి కొమురంభీమ్ ఆద్యుడని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబు నాయక్ అన్నారు. మంగళవారం నిజాం కళాశాలలో కొమురంభీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గిరిజన హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి కొమురం భీమ్ అని కొనియాడారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ రమణ నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్


బల్దియా కమిషనర్ ఇలంబర్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ బల్దియా కమిషనర్ కె.ఇలంబర్తిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కమిషనర్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో ఎక్కువ శాతం మంది నిరుపేదలే ఉన్నారని ఆయన అన్నారు. ఎన్నో బస్తీల్లో ఇంకా సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి గతంలో తాను ప్రతిపాదనలు పంపించాన్నారు. మరోవైపు కార్వాన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం తగ్గిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నియోజకవర్గంలో అధునాతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం రూ.292 కోట్లు మంజూరు చేయించారని ఈ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయన్నారు. నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్లలో వరద ముంపు ప్రమాదాన్ని నివారించేందుకు భారీ పైప్‌లైన్ పనులు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్నాయని ఆయన కమిషనర్ దృష్టికి తెచ్చారు. టోలిచౌకీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార కూడలి అని ఈ చౌరస్తా వద్ద కూడా అభివృద్ధి పనులు పూర్తి కాలేదన్నారు. వర్షాకాలం కంటే ముందే తాను బల్దియా కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులను కలిసి టోలిచౌకీ చౌరస్తా దుస్థితిని వివరించానన్నారు. అయినా టోలిచౌకీ చౌరస్తా వద్ద నేటికీ వరద నీరు చేరి బీభత్సం సృష్టిస్తుందన్నారు. నియోజకవర్గంలో పర్యటించి స్వయం పరిస్థితిని అంచనా వేయాలని ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. కాగా సంబంధిత అధికారులతో కలిసి త్వరలోనే తాను కార్వాన్‌లో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ఉన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. మదీనానగర్, సాదత్ నగర్ ప్రాంతాల్లో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైప్‌లైన్‌లు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగు నీటి సమస్యలు తలెత్తున్నాయన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ నూతన పైప్‌లైన్ మంజూరు చేయించారని ఆయన చెప్పారు. మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇషాక్, మహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ఆవరణం.. కళా తోరణం


పెచ్చులూడిన ఓపెన్ ఎయిర్ థియేటర్ తెర

శిథిలావస్థలో తెలుగు లలితకళా తోరణం
- పెచ్చులూడుతున్న పేదల వెండితెర
- పట్టించుకోని సాంస్కృతిక అధికారులు

నాంపల్లి: ఒకప్పుడు ప్రేక్షకులకు వినోదాన్ని పంచిన తెలుగు లలితకళా తోరణం చరిత్ర మసకబారుతోంది. పదేళ్లుగా ఈ ప్రాంగణం ఆదరణకు నోచుకోవడం లేదు. తెలుగు లలిత కళాతోరణం నాంపల్లిలోని పబ్లిక్‌గార్డెన్స్‌లో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు నెలకొల్పారు. సమైక్య రాష్ట్రంలో ప్రతి ఏటా మేలో ఇక్కడ నెల రోజుల పాటు తెలుగు సినిమాలను ఉచితంగా ప్రదర్శించేవారు. హైదరాబాద్ ప్రాంత వాసులకు ఇదెంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో 7 నుంచి 9 గంటల వరకు రోజుకొక్క తీరున తెలుగు సినిమాను ప్రదర్శించేవారు. కానీ ఇప్పుడు ఆ ప్రాంగణాన్ని పట్టించుకునే నాథుడే లేరు. ప్రస్తుతం ఈ థియేటర్ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధీనం ఉంది. ఈ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కమర్షియల్ థియేటర్‌గా మార్చి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలు చేపట్టే వార్షికోత్సవం వేడుకలకు వేదికగా మార్చేశారు. పేద వాడికి ఒక రోజు ఉచితంగా సినిమాను ప్రదర్శించలేని దీనావస్థకు దిగజార్చారు. ఓపెన్ ఎయిర్ థియేటర్ తెర పూర్తిగా పెచ్చులూడిపోయింది. ప్రాంగణమంతా పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. మరుగుదొడ్లు పాడైపోయాయి. ఫౌంటెన్లు పని చేయకుండా పోయాయి. సినిమా ప్రొజెక్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాష్ట్ర సాంస్కృతిక శాఖ తెలుగు లలితకళా తోరణం ప్రాంగణానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ప్రేక్షక మహాశయులు కోరుతున్నారు. ఈ దిశగా సాంస్కృతిక శాఖను ప్రక్షాళన చేసి ఆదరణకు నోచుకోని కళా వైభవాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ప్రాంగణంలో పెరిగిన పచ్చిక

వెలగని వీధి దీపాలు


ఉప్పుగూడలో వెలగని వీధి దీపాలు

చార్మినార్: ఉప్పుగూడ మహంకాళి ఆలయం వద్ద వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానిక అమ్మవారు భక్తులు అంధకారంలోనే ఆలయానికి వెళ్లాల్సి వస్తోంది. కొన్ని రోజులుగా ఇక్కడి వీధి దీపాలు పని చేయడం లేదు. అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. చీకట్లోనే భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. సాధ్యమైనంత వెంటనే ఇక్కడి వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఈఈ రామారావును కోరారు.

సిబ్బంది అంకిత భావంతో పని చేయాలి



చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపోలో మంగళవారం హైదరాబాద్ రీజియన్ స్థాయి త్రైమాసిక ప్రగతి రథచక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్.ఎం. బి.వరప్రసాద్ ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎంలు బి.సుచరిత, జగన్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రాజయ్య, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీరింగ్ టి.దయాకర్, ఫలక్‌నుమా డిపో మేనేజర్ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి


డాక్టర్ టీఎస్. వంశీ తిలక్

అబిడ్స్: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసం కేసులో పోలీసులు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని గ్రేటర్ బీజేపీ నాయకుడు డాక్టర్ టీఎస్.వంశీ తిలక్ పేర్కొన్నారు. విగ్రహ ధ్వంసం కేసులో ఒక హోటల్‌లో ఉండి రెచ్చగొట్టే విధంగా పథకం పన్నినవారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇటీవల కొంతమంది దుండగులు ఆలయాలను ధ్వంసం చేయడం చాలా బాధాకరమన్నారు. అలాంటి వారి పట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణలో బీజేపీదే అధికారమన్నారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదింపి బీజేపీని గెలిపిస్తారని వంశీ తిలక్ పేర్కొన్నారు.

కుమ్మరులకు అండగా ఉంటా

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరులకు అండగా ఉంటానని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కే నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ శాలివాహన కుమ్మర సంఘం వారు మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కుమ్మరులకు అందేలా చూసానని పేర్కొన్నారు. కౌన్సిలర్లు కే లక్ష్మీనారాయణ, డీ పురుషోత్తం, ముత్యాలు, కిరణ్‌కుమార్, నర్సింగ్‌రావు, శ్రీశైలం, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

సన్మానం


పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న అంబటి శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో బీఆర్‌ఎస్ ఒక్కటే కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం అని హైదరాబాద్ ఇన్‌చార్జిగా నియమితులైన పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాస్ మంగళవారం కార్తీక్‌రెడ్డిని కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లల్లో బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణను అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల పాలనలో తెలంగాణ అభివృద్ధిలో 60 ఏళ్లు వెనక్కిపోయిందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జగ్గ యాదవ్, కృష్ణదాస్, ముత్యాల భాస్కర్, ఎస్.రాములు, దుర్గరాజ్, విజయలక్ష్మి తదితరులున్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు శాంతిప్రియులు



గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు శాంతిప్రియులని గ్రేటర్ హైదరాబాద్ ఆల్ జోన్స్ పీస్ అండ్ మైత్రి కమిటీ ప్రధాన కార్యదర్శి కిషన్‌శర్మ అన్నారు. కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు ఇమ్రాన్ అలీ ఖాన్ లడ్డూ మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌శర్మ మాట్లాడుతూ..యువతరం నాయకులు పీస్ అండ్ మైత్రి కమిటీల్లో సభ్యత్వం తీసుకుంటూ శాంతిభద్రతలను కాపాడడానికి ముందుకు వస్తున్నారన్నారు. నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో కొనసాగుతున్న పీస్ అండ్ మైత్రి కమిటీల్లో అన్ని వర్గాల ప్రజలు సభ్యులుగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆజం ఖాన్ తదితరులున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు



యాకుత్‌పురా: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్-07 డిప్యూటీ కమిషనర్ శైలజా తెలిపారు. మంగళవారం ఆమె యాకుత్‌పురా, తలాబ్‌కట్టా, చాచాగ్యారేజ్, షా జహాన్ ఫంక్షన్‌హాల్, నషేమన్‌నగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కమిషనర్, జోనల్ కమిషనర్ల ఆదేశాల మేరకు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక పరిశీలన కొనసాగిస్తున్నామన్నారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నమని తెలిపారు.

బాలుడిపై లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

లంగర్‌హౌస్: బాలుడిపై లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధించారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై తీర్పును స్పెషల్ సెషన్ కోర్టు జడ్జి పుష్పలత మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఖాదర్‌బాగ్‌లో నివాసముండే బాలుడు అస్లాం(13) మదర్సాలో చదివేవాడు. 2018 జూలైలో మదర్సాకు వెళ్లిన ఆ బాలుడు 3వ తేదీ ఫ్లోర్‌మిల్ వద్ద పాడుబడిన ఇంటిలో శవమై కనిపించాడు. అతనిపై లైంగిక దాడి చేసి ఆ తర్వాత హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తు చేయగా అస్లాం స్నేహితుడు వృత్తిరీత్యా ఎలక్ట్రీషన్ అయిన షేక్ తాజ్ అలియాస్ తాజుద్దీన్(19) ఈ హత్య చేసినట్లు తేల్చారు. అతన్ని అరెస్టు చేయగా బుధవారం తీర్పు వెల్లడైంది. నిందితుడికి రూ.20వేల జరిమానాతో పాటు జీవితఖైదు విధించారు.

గుడిమల్కాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి న రోజు నుంచి తెలంగాణకు శని చుట్టుకుందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మళ్లించడానికి పార్టీ ఢిల్లీ నేతల ఖజానా నింపడానికి మూసీ సుందరీకరణ అంటూ పేదల ఇళ్లు కూలుస్తున్నారన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా, యువ మోర్చా నాయకులు ఉన్నారు.

అన్నిదానాల్లో రక్తదానం ఎంతో గొప్పది


ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: అన్నిదానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి మంగళవారం ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రక్తదానంపై సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తాము నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో అన్ని వర్గాల ప్రజలు తమ సహాయ సహకారాలు అందించారని, దీన్ని వల్లే రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులున్నారు.

అభినందనలు


క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న డీఈఓ రోహిణి

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ క్రికెట్ జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో ఆ జట్టు క్రీడాకారులను హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణి షీల్డ్ అందజేసి అభినందించారు. మంగళవారం ఆలియా మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచారని కొనియాడారు. గద్వాల్‌లో జరిగిన పోటీల్లో హైదరాబాద్ జిల్లా జట్టు క్యాప్టెన్ దేవ్ ఆధ్వర్యంలో ద్వితీయస్థానంలో విజయం పొందారు. ఆ క్రీడాకారులను డీఈఓ ఆర్.రోహిణి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ చిరంజీవి, వెంకటేశ్వర్లు, ప్రమోద్‌కుమార్, కోచ్ శ్రీదేవి, ఆర్గనైజర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఆటోరిక్షా కార్మికులకు అందజేయాలి


కార్మికులకు ఆటోరిక్షాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జుల్ఫీకర్ అలీ

శాలిబండ: ప్రజలు చెత్తాచెదారాలను రోడ్లపై వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటోరిక్షా కార్మికులు అందజేయాలని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ అన్నారు. దారుషిఫా మైదానంలో మంగళవారం ఆయన ఆటోరిక్షా కార్మికులకు 40 ఆటోరిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీర్ జుల్ఫీకర్ అలీ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తా చెదారాలను రోడ్లపై వేయకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త సేకరణను మరింత సౌకర్యంగా చేయడానికి కార్మికులకు ఆటోరిక్షాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని వనరులు అందించడమే లక్ష్యంగా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత, డాక్టర్ జ్యోతి, కార్పొరేటర్‌లు సోహేల్ ఖాద్రీ, ముజఫర్ అలీ, నస్రీన్ సుల్తానా, సున్నం రాజ్ మోహన్‌తో పాటు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు దుర్గా ప్రసాద్, వి.ధర్మేందర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



గౌలిపురా: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తోందని బీజేపీ గౌలిపురా డివిజన్ పోలింగ్ బూత్ నెంబర్: 51 కో ఆర్డినేటర్ భానుప్రకాశ్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు రవి కుమార్, దాస్ అన్నారు. మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు ఆదర్శ మహేశ్ హాజరై మాట్లాడుతూ.. కార్యకర్తలే ఊపిరిగా ప్రజలే దేవుళ్లుగా కొలిచే పార్టీ బీజేపీ అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డొంకి యాదగిరి, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి కొడి సురేందర్, సీనియర్ నాయకులు జమాల్‌పూర్ అశోక్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, హనుమాన్‌నగర్ ఫేజ్-3 వాసులు జమాల్‌పూర్ బాబురావు, నరేందర్, వేణు, గోపాల్ పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు సమస్యలను పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న ఎండీ అశోక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

అబిడ్స్: వాటర్‌బోర్డు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు వాటర్‌బోర్డు తరఫున మెరుగైన సేవలందించేందుకు వాటర్‌బోర్డు అధికారులు, సిబ్బంది కృషి చేస్తారన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి మేరకు ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, డ్రైనేజీ ఇతర సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ..స్థానికులు ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం ప్రజల కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వారి సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. వాటర్‌బోర్డు సీజీఎం ప్రభు, జీఎం జాన్ షరీఫ్, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.